ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులు

- రేవంత్ సర్కార్ అక్రమాలు, వైఫల్యాలను బయట పెడుతూనే ఉంటాం
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్

జగిత్యాల, జనవరి 8: ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తెలంగాణ ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం ఆగదని, రేవంత్ సర్కార్ అక్రమాలు, వైఫల్యాలను బయట పెడుతూనే ఉంటామని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబం తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో కేసులు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిని ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ కేసులు ఏమి చేయలేవన్నారు. కేటీఆర్ తెలంగాణలో హైదరాబాద్ బ్రాండ్ ఈమేజీ పెంచడానికే ఫార్ములా ఈ కార్ రేస్ తీసుకువచ్చాడని, ఎన్ని రకాల కేసులు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దాకా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, అరెస్టులతో మమ్మల్ని బలహీనపరచాలని రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర చెల్లదన్నారు. కేటీఆర్ అడుగడుగునా రేవంత్ రెడ్డి తప్పిదాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే ఈ కేసు పెట్టారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

అధ్యాపకులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్ సుహాసిని

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్ సుహాసిని

ధర్మపురి, జనవరి 8: విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్ సుహాసిని పేర్కొన్నారు. ధర్మపురి, బీర్‌పూర్, సారంగాపూర్ జూనియర్ కళాశాలల్లో బుధవారం ఆమె అధ్యాపకులను విరామ సమయాల్లో కలిసి మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి శాతవాహన విశ్వవిద్యాలయం వరకు అన్ని విశ్వవిద్యాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. కనీస సౌకర్యాలు, ప్రయోగశాలలు, వసతులు, భవనాలు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుకు అసెంబ్లీ వేదికగా పోరాటం చేసి సాధించి తీరుతానన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఉన్నారు.

అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి, జనవరి 8: ఈనెల 26 నుంచి అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన 93 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, 219 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అలాగే, పెగడపల్లికి చెందిన బైర అంజమ్మ భర్త ఇటీవల గల్ఫ్‌లో మృతి చెందగా, గల్ఫ్ బాధిత సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, అధికారులు పూర్తి పారదర్శకతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందగిరి విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐలు శ్రీనివాస్, ఆంజనేయులు, నాయకులు రాములుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, తిరుపతి, శోభారాణి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కార్యవర్గం ఎన్నిక

పెగడపల్లి, జనవరి 8: పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్, ఎండపల్లి మండలాల వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం పెగడపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుమాండ్ల సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెల్మ సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండారి రవీందర్, గౌరవాధ్యక్షుడిగా కొంగల రాజనరేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారుగా తోడేటి తిరుపతి, కోశాధికారిగా ఎండీ షరీఫ్, కార్యదర్శులుగా పాకాల సుధాకర్, పొరండ్ల రాజేందర్, సభ్యులుగా కర్నాల కాశీరాం, అనుమాండ్ల సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు.

నియామకం

కోరుట్ల రూరల్, జనవరి 8: ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కల్లూరు మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యను నియమిస్తూ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ గజ్జెల స్వామి బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గజ్జెల స్వామి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ఈనెల 31న చేపట్టే గద్దర్ విగ్రహావిష్కరణకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విరాళాలు అందజేత

మారుతీనగర్, జనవరి 8: పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి మెట్‌పల్లి పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ద్యావపల్లి రాజారాంకు రాంపల్లి నాగభూషణం దంపతులు రూ.25,116, గుంటుక చిన్నయ్య దంపతులు రూ.51,116 బుధవారం అందజేశారు. ఇక్కడ పద్మశాలీ సంఘం సభ్యులు నాగరాజు, ఆనంద్, గౌతం, సత్యనారాయణ, భాస్కర్, నరేశ్, సత్యం, హన్మాండ్లు, మురళి, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, చిన్నయ్య, ద్విజేంద్రనాథ్, శ్యామ్, జగదీశ్వర్, అంజయ్య, తదితరులున్నారు.

కోరుట్ల రూరల్, జనవరి 8: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ తోట నారాయణ బుధవారం రూ.10,016 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు చిట్యాల నరేశ్, మాసుల నర్సింలు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్, జనవరి 8: వీవీరావుపేటలోని అంబేద్కర్ కూడలి వద్ద గ్రామానికి చెందిన గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పెనుకుల అశోక్, మహేశ్, నారాయణ, రఘుపతి, శ్రీమాన్, ప్రసాద్, స్వామి, ప్రవీణ్, నరేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, జనవరి 8: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో బుధవారం టీపీ స్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఈవో ఆకుల లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. టీపీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, జిల్లా కార్యదర్శి పీవీ ప్రసాద్, రమేశ్, జయంత్‌కుమార్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్, జనవరి 8: భూషణ్‌రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కూన శ్రీనిధి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ నవీన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనిధిని ఉపాధ్యాయులు అభినందించారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | అశోక్‌నగర్ శాఖ-20135, జగిత్యాల -505327

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ (3)తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద)

బ్యాంకు నుండి దిగువ రుణగ్రహీత(లు) శ్రీ జోగినపల్లి గణేష్ లక్ష్మణ్ తండ్రి లక్ష్మణ్, ఫ్లాట్ నెం.103, 1వ అంతస్తు, పవన్ కుటీర్ అపార్ట్‌మెంట్, వీర్‌సవర్కార్ మార్గ్, సెక్షన్-25, ఉల్హాస్‌నగర్-4, ఉల్హాస్‌నగర్, థానే, మహారాష్ట్ర-421004. ఆస్తి: ఇం.నెం.1-5-81/1/బి, అరవింద్ నగర్, జగిత్యాల-505327, సెల్: 9665038888 వారు పొందిన రుణసదుపాయాల యొక్క అసలు మొత్తం మరియు వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలమైనారని మరియు రుణం నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించబడినవని ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద వారికి నోటీసులు చివరిగా తెలిసిన వారి చిరునామాలకు జారీచేయబడినవి. అయితే, అవి అందజేయబడకుండానే వాపసు వచ్చినందున ఈ బహిరంగ ప్రకటన ద్వారా వారికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

క్ర.సం.	రుణగ్రహీత పేరు/నోటీస్ తేది/ NPA తేది	ఆస్తుల వివరాలు/ఎన్‌ఫోర్స్ చేయు సెక్యూర్డ్ అసెట్ల చిరునామా	బకాయి మొత్తం
1	శ్రీ జోగినపల్లి గణేష్ లక్ష్మణ్ తండ్రి లక్ష్మణ్, ఫ్లాట్ నెం.103, 1వ అంతస్తు, పవన్ కుటీర్ అపార్ట్‌మెంట్, వీర్‌సవర్కార్ మార్గ్, సెక్షన్-25, ఉల్హాస్‌నగర్-4, ఉల్హాస్‌నగర్, థానే, మహారాష్ట్ర-421004. ఆస్తి:ఇం.నెం.1-5-81/1/బి, అరవింద్ నగర్, జగిత్యాల-505327, సెల్: 9665038888 NPA తేది: 30-10-2024 డిమాండ్ నోటీస్ తేది: 01-01-2025 62227366161 (H/L), 37906612898 (Top up)	శ్రీ జోగినపల్లి గణేష్ లక్ష్మణ్ తండ్రి లక్ష్మణ్ పేరున గల, రిజిస్ట్రేషన్ సబ్‌జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా కరీంనగర్ అధికార పరిధిలో, జగిత్యాల మున్సిపాలిటి పరిధిలో, అరవింద నగర్ జగిత్యాల టౌన్ మరియు మండలం వద్ద గల సర్వే నెం.139లో 261.66 చ. గజాలు లేదా 218.78 చ.మీటర్లు విస్తీర్ణం, ఇం.నెం.1-5-81/1/బి కలిగిన ఆస్తి యావత్తు, **సరిహద్దులు: తూర్పు:** డీకొండ ఆనంద్ ఇల్లు (ఇం.నెం.1-5-78), **పశ్చిమం:** కొత్త భాస్కర్ భూమి, **ఉత్తరం:** తునికి రమణయ్య మరియు బ్రహ్మయ్య భూమి, **దక్షిణం:** 18అ.వెడల్పు రోడ్.	01-01-2025 నాటికి రూ. 24,37,420/- (ఇరవై నాలుగు లక్షల ముప్పై ఏడు వేల నాలుగు వందల ఇరవై రూపాయలు మాత్రమే)

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సర్వీసు కొరకు చర్యలు చేపట్టబడినవి. ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన రుణగ్రహీత(లు) మరియు/లేదా వారి హామీదారు(లు) (వర్తించినప్పుడు) కోరబడుచున్నారు. లేనిచో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(4) క్రింద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు చేపట్టబడతాయి.

తేది: 01.01.2025
ప్రదేశం: జగిత్యాల

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులే

మెట్‌పల్లి, జనవరి 8: వయోవృద్ధులైన తల్లిదండ్రులను విస్మరించే వారు శిక్షార్హులవుతారని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని కళానగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ మెట్‌పల్లి డివిజన్ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్వర్ణకార సంఘ సమావేశ మందిరంలో వయోవృద్ధుల సంక్షేమ, రక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్‌కు సంబంధించి ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. వయోవృద్ధులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, తల్లిదండ్రుల సంరక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత వారసులదేనన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సౌడాల కమలాకర్, నాయకులు విశ్వనాథం, అశోక్‌రావు, ప్రభాకర్‌రావు, స్వామి, శివానందం, రాజామోహన్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

జగిత్యాల, డిసెంబర్ 8: జిల్లాలోని సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి జిల్లా నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్‌ల నుంచి సాగునీటి విడుదల, నీటి నిల్వలు, పంటల సాగు విస్తీర్ణం, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను వేగవంతం చేసి రైతుల అవసరాలు తీర్చాలని, అధికారులు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా ప్లాన్ చేయాలని, వారబంధి ద్వారా జోన్ 1, 2లకు నిబంధనల ప్రకారం నీటిని విడుదల చేయాలన్నారు. గోదావరి నది లిఫ్టులపై ఆధారపడి సాగు చేసుకునే రైతాంగాన్ని కూడా ఆదుకునేలా గోదావరిలోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, రైతులు ఆందోళన చెందవద్దని, సాగు నీరందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో చివరి ఆయకట్టు వరకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, డీఈలు ఇంజినీరింగ్, ఎలక్ట్రిసిటీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

జగిత్యాల, జనవరి 8: రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖలతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఆయన ప్రజాభవన్‌లో మంత్రులు సీతక్క, కొండ సురేఖతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్థిక సహాయం కోసం బ్యాంక్ అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో రఘువరున్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్‌ను సన్మానిస్తున్న మెట్‌పల్లి డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కళాశాలల్లో అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం

జగిత్యాల టౌన్, జనవరి 8: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు. బుధవారం మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు, నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులతో కూడిన ప్రయోగశాలలు, కంప్యూటర్లు, గ్రంథాలయం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ ల్యాబ్, విశాలమైన క్రీడా మైదానం ఉన్నట్లు వివరించారు. అలాగే, బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ప్రచారంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, రాజు, సాయి మధుకర్, గోవర్ధన్, సురేందర్, శ్రీనివాస్, ప్రతిభ, స్వరూపారాణి, స్వప్న, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, జనవరి 8: మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేరాలని అధ్యాపకులు ఇబ్రహీంపట్నం జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ, మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యాబోధన చేస్తారని, విద్యార్థులు చేరాలని సూచించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ సంజీవ్‌ను శాలువాతో సత్కరించారు. మెట్‌పల్లి డిగ్రీ కళాశాలలో సరస్వతీ విగ్రహం ఏర్పాటుకు రూ.2 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకయ్య, వైస్ ప్రిన్సిపాల్ దేవన్న, అకాడమీ కో-ఆర్డినేటర్ రాజేందర్, అధ్యాపకులు మనోజ్‌కుమార్, గట్టయ్య, అంజయ్య, శ్రీకాంత్, సత్తయ్య, బాపు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు

జగిత్యాల, జనవరి 8: యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు 2445 కనెక్షన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్క డిసెంబర్‌లోనే సుమారు 286 సర్వీసులు మంజూరు చేశామని, 2023 సంవత్సరంతో పోల్చుకుంటే సుమారు 29 శాతం కనెక్షన్లు పెరిగినట్లు తెలిపారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్ చేయడం ద్వారా దరఖాస్తు ఎక్కడ పెండింగ్‌లో ఉన్నది, దానికి గల కారణాలను అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులుబాటు ఉందన్నారు.

కాలువకు భూములు ఇవ్వం

కథలాపూర్, జనవరి 8: కథలాపూర్ మండలం కలికోట గ్రామ శివారులో సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ కుడి కాలువ పనులకు భూములు ఇవ్వమని ఆర్డీవో జివాకర్‌రెడ్డికి రైతులు వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ పరిధిలో 48 ఎకరాల వ్యవసాయ భూమి సూరమ్మ చెరువు ప్రాజెక్టు కుడి కాలువ కోసం అవసరమని అధికారులు తెలిపారు. తమకు వ్యవసాయ భూమి తక్కువగా ఉందని, భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేకపోతే ఎకరానికి రూ. 40 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులకు రైతులు విన్నవించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గొల్లపల్లి, జనవరి 8: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చిర్ర సతీశ్ విద్యార్థులకు సూచించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, సీఐ నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లేశం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి, జనవరి 8: పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు, మండల ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్, సంపత్‌గౌడ్, వెంకటరెడ్డి, ఎల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

పెగడపల్లి, జనవరి 8: గంజాయి విక్రయించిన వ్యక్తిని బుధవారం పెగడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి వివరాలు వెల్లడించారు. ఈనెల 5న మండలంలోని నర్సింహునిపేట గ్రామంలో నలుగురు వ్యక్తులు కిలో గంజాయితో దొరకగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ నలుగురికి గంజాయిని విక్రయించిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం బొప్పాపూర్‌కు చెందిన అనక నరేశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవికిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నంది పురస్కారం

ధర్మపురి, జనవరి 8: జగిత్యాలలో గానకోకిల కళానికేతన్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురికి చెందిన ఉపాధ్యాయుడు బోగ శివప్రసాద్‌ను నంది పురస్కారంతో సన్మానించారు. వ్యాఖ్యాతగా అనేక కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచినందుకు గానూ బోగ శివప్రసాద్‌కు నంది పురస్కారం లభించింది.

ప్రజాభిప్రాయం మేరకే ప్రత్యేక గ్రామ పంచాయతీ తీర్మానం

పెగడపల్లి, జనవరి 8: బతికపల్లి అనుబంధ గ్రామాలైన కొండాయపల్లి, పుల్లయ్యపల్లిని కలిపి కొండాయపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటుకు తీర్మానం చేసి కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు బతికపల్లి మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. పెగడపల్లిలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రెండు గ్రామాల ప్రజల కోరిక మేరకే ఈ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు శోభారాణి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణహరి, సుధీర్, మల్లేశం, గంగరాజం, అనిల్, శ్రీను, దుర్గాప్రసాద్, రవి, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల, జనవరి 8: సీఎం కప్ పోటీల్లో భాగంగా రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఎన్ చంద్రమోహన్ రజత పతకం, బాక్సింగ్‌లో అఖిల్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, పీడీ శ్రీనివాస్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, శ్రీనివాస్, సురేందర్, మల్లికార్జున్, సంజీవయ్య, పద్మ, విద్యాదేవి, హరిత, అరుణ, రజినీ అభినందించారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

జగిత్యాల రూరల్, జనవరి 8: మండలంలోని అంతర్గాం జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రాము బుధవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన అల్లెపు పూజ, విశరాత్రి శరణ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు చీటి భూపతి రావు, బాలే సరోజ, ఎర్రోజు అనిత, రాజేందర్, ఫక్రుద్దీన్, శరత్, కోటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

ఇంటర్ విద్యాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

సారంగాపూర్, జనవరి 8: ఇంటర్ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ సూచించారు. బీర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై సమీక్షించారు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

సారంగాపూర్, జనవరి 8: మండల కేంద్రంలోని బెన్‌హిన్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమోల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

సారంగాపూర్, జనవరి 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీడీవో చౌడారపు గంగాధర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఇంటి పన్ను వసూలు, వాహన ట్రాకింగ్, ఆయా గ్రామాలకు సంబంధించిన 5 నెలల యాక్షన్ ప్లాన్, నర్సరీలు, ఉపాధి హామీ, అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్, జనవరి 8: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా నిజామాబాద్ జిల్లాకు లారీలో ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా మెట్‌పల్లి శివారులోని మారుతీనగర్ సమీపంలో బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోరుట్ల నుంచి నిజామాబాద్ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని పట్టుకొని డ్రైవర్ దిలీప్‌ను విచారించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ దిలీప్, ఆర్మూర్‌కు చెందిన లారీ యజమాని పల్లెపు రాజన్నపై ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జగిత్యాల టౌన్, జనవరి 8: పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్ పశు వైద్య, పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని సబ్ సెంటర్లలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, వెటర్నరీ రీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు ఫీల్డ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

'పది' విద్యార్థులకు దాతల సహకారం

మారుతీనగర్, జనవరి 8: మెట్‌పల్లి పట్టణంలోని చావిడి వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం దాతల సహకారం అందించారు. కోటగిరి సుజాత ఇంగ్లిష్ మోడల్ పేపర్లు అందజేశారు. సాయంత్రం నంబి అరుణ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు రాజేందర్‌శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

కొడిమ్యాల, జనవరి 8: అప్పారావుపేటలో గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి సస్పెన్షన్‌కు గురైన వెంకటేశ్వర్లు పై జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ బుధవారం విచారణ జరిపారు. గతంలో వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సమయంలో అప్పారావుపేట గ్రామంలో అక్రమ లే-అవుట్లకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణపై అప్పటి కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. విచారణ అధికారిగా మనోజ్‌కుమార్‌ను నియమించగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఎంపీవో సలీం, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర నాయకులను కలిసిన జిల్లా నాయకులు

జగిత్యాల టౌన్, జనవరి 8: హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో టీఎన్జీవో డైరీని సంఘం కేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో రాష్ట్ర నాయకులను సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను విన్నవించారు.

నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

కోరుట్ల, జనవరి 8: నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐ-2 రాంచంద్రం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శబరిమలకు మెట్‌పల్లి ఆర్టీసీ బస్సు

మారుతీనగర్, జనవరి 8: మెట్‌పల్లి బస్‌డిపో నుంచి శబరిమలకు అయ్యప్ప దీక్షాపరుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు చేయగా బుధవారం డిపో మేనేజర్ దేవరాజ్ ప్రారంభించారు. మొదటిసారి పట్టణం నుంచి బస్సు ఏర్పాటు చేసిన ఆర్టీసీ డిపో మేనేజర్‌కు దీక్షాపరులు, గురుస్వాములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు, ఆర్టీసీ సిబ్బంది ఐఆర్‌కే రెడ్డి, లాల్, నాగన్న, ప్రభాకర్, సురేశ్, నారాయణ, రాములు, వేణు, నగేశ్, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, జనవరి 8: ఇబ్రహీంపట్నం మండలం భర్తీపూర్ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సంఘం సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సహకారంతో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి డ్రైనేజీ నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దివాకర్, నాయకులు సాయికుమార్, కిషన్, గంగాధర్, శ్రీనివాస్, షౌకద్, రాజేందర్, సుమన్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.